# ఎమ్మెల్యే గాంధీపై చర్యలు తథ్యం

- ఆయన అనుచరులపైనా కేసు
- రాష్ట్రంలో మావోయిస్టుల కదలికల్లేవ్
- ఉగ్రవాదుల జాడ కూడా లేదు.. ఉంటే చెప్తాం
- విలేకరుల సమావేశంలో డీజీపీ జితేందర్

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ) : ఎమ్మెల్యే అరికెపూడి గాంధీపై చర్యలు తీసుకుంటామని, ఆయన అనుచరులపైనా కేసులు నమోదు చేశామని డీజీపీ జితేందర్ వెల్లడించారు. హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, గాంధీ వివాదంపై స్పందిస్తూ ఇప్పటికే గాంధీ, ఆయన అనుచరులపై కేసులు నమోదు చేసినట్టు వివరించారు. ఛత్తీస్‌గఢ్‌లో కూంబింగ్ జరుగుతున్నందున తెలంగాణలోకి మావోయిస్టులు వస్తే.. తమ భద్రతా దళాల నుంచి ప్రతిఘటన ఎదుర్కోక తప్పదని, అవసరమైతే ఎన్‌కౌంటర్లకూ వెనుకాడబోమని స్పష్టంచేశారు. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర మినహా తెలంగాణలో మావోయిస్టుల కదలికలు లేవని చెప్పారు. హైదరాబాద్‌లో ఉగ్రవాదుల జాడ లేదని తెలిపారు. ఉగ్ర కదలికలపై నిఘా ఉంచామని, సమాచారం ఉంటే తెలియజేస్తామని చెప్పారు. వినాయక నిమజ్జనాల్లో డీజే సిస్టమ్స్ ఉపయోగించొద్దని, వాటివల్ల ఎన్నో అనర్థాలు ఉన్నాయని సూచించారు. చిన్న చిన్న ఘటనలు మినహా వినాయక చవితి, నిమజ్జనాలు, మిలాద్ ఉన్ నబీ కార్యక్రమాలు ప్రశాంతంగా ముగిశాయని చెప్పారు. మొత్తం 5,879 ప్రాంతాల్లో 1,36,638 విగ్రహాలు నిమజ్జనం చేసినట్టు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 15,400 మంది పోలీసులు, 47 ప్లాటూన్స్‌తో విధులు నిర్వర్తించినట్టు చెప్పారు.

**జైనూర్ ఘటన దురదృష్టకరం**

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన జైనూర్ ఘటన దురదృష్టకరమని డీజీపీ అన్నారు. వెంటనే పరిస్థితిని అంచనా వేసి, 38 మందిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. 720 మంది పోలీసులు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌తో జైనూర్ మొత్తం మోహరించామని వివరించారు. లా అండ్ ఆర్డర్ ఏడీజీ, ఐజీతో భద్రతను పర్యవేక్షించామని తెలిపారు. సివిల్ కేసుల్లో తలదూర్చిన చిక్కడపల్లి ఏసీపీపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ నిందితులకు రెడ్ కార్నర్ నోటీసులు ఇవ్వాలని కోరినట్టు తెలిపారు. దానికి చాలా ప్రాసెస్ ఉంటుందని సీబీఐ, ఇంటర్‌పోల్ సహకారంతో నోటీసులు ఇచ్చే అవకాశం ఉందని చెప్పారు. డప్పు కొట్టకపోతే గ్రామ బహిష్కరణ చేసిన ఘటన తమ దృష్టికి వచ్చిందని, ఆ వెలివేతకు సంబంధించిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో ఏడీజీ మహేశ్ భగవత్, ఐజీలు సత్యనారాయణ, చంద్రశేఖర్‌రెడ్డి, రమేశ్ ఉన్నారు.

## పిడుగుపాటుకు నలుగురి మృతి

న్యూస్‌నెట్‌వర్క్, సెప్టెంబర్ 24: తెలంగాణ వ్యాప్తంగా మంగళవారం ఉరుములు, మెరుపులతో కూడిన ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. పలు చోట్ల పిడుగులు పడి నలుగురు మృత్యువాతపడగా.. పలువురు గాయపడ్డారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా మోస్తరు వర్షం కురువగా.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో భారీ వర్షం పడింది. ఖమ్మం నగరంలోని ప్రధాన వీధులన్నీ జలమయమయ్యాయి. వ్యవసాయ పనులు చేస్తున్న సమయంలో పిడుగుపడి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం జగ్గారం శివారు బూరుగుగుంపునకు చెందిన కూలీలు కట్టం నాగశ్రీ (22), సున్నం అనూష (23) మృతి చెందారు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం బత్తులపల్లికి చెందిన లక్ష్మయ్య (65) పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం రంగయ్యపల్లిలో సోమవారం రాత్రి పిడుగుపడి ఎర్రబొజ్జు రాధిక ఇల్లు ధ్వంసమైంది. ఇంట్లో వారు ఊరికి వెళ్లడంతో ప్రాణనష్టం జరగలేదు. సింగూరు ప్రాజెక్టు నుంచి వరద వస్తుండటంతో మెదక్ జిల్లా పాపన్నపేట మండలం ఏడుపాయల వనదుర్గా ప్రాజెక్టు పొంగిపొర్లుతున్నది. దీంతో ఏడుపాయల వన దుర్గమ్మ ఆలయాన్ని అధికారులు మూసివేశారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం పోతిరెడ్డిపేటలో పిడుగుపడి పశువుల కాపరి కృష్ణకుమార్ (30) మృతి చెందాడు. వారం రోజులుగా వానలు లేక బీటలు వారుతున్న వరికి ఈ వర్షం ఊరటనిచ్చింది. పత్తి పంట రైతులకు సైతం కలిసొచ్చింది.

**బంగాళాఖాతంలో అల్పపీడనం**

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో రాగల నాలుగురోజుల పాటు భారీ వర్షాలు కొనసాగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. వరంగల్, నాగర్‌కర్నూల్, నిర్మల్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నిజామాబాద్, జోగుళాంబ-గద్వాల, హనుమకొండ జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. ఖిల్లా-వరంగల్ మండలంలో 9.67 సెం.మీ. అత్యధిక వర్షపాతం నమోదైంది.

**ఇస్రో చైర్మన్‌కు పుస్తక బహూకరణ**

రవీంద్రభారతిలో మంగళవారం తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ, రీజియన్ మళయాలీ అసోసియేషన్, హైదరాబాద్ ఫోరమ్ ఫర్ పొలిటికల్ కార్టూనిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్పేస్ టూన్స్ పేరిట నిర్వహించిన ఎగ్జిబిషన్‌లో నమస్తే తెలంగాణ కార్టూనిస్ట్ మృత్యుంజయ తన కార్టూన్ల పుస్తకాన్ని ఇస్రో చైర్మన్ డాక్టర్ సోమనాథ్,పర్యాటక, సాంస్కృతిక మంత్రి జూపల్లి కృష్ణారావుకు అందజేశారు.

## నేడు, రేపు ఓపెన్ పరీక్ష ఫీజు చెల్లించే చాన్స్

హైదరాబాద్, సెప్టెంబర్ 24(నమస్తే తెలంగాణ): ఓపెన్ స్కూల్ సొసైటీ వార్షిక పరీక్షలకు హాజరయ్యేందుకు అధికారులు మరో అవకాశమిచ్చారు. బుధ, గురువారాల్లో తాత్కాల్ కింద ఫీజు చెల్లించేందుకు అవకాశమిచ్చినట్టు డైరెక్టర్ సీవీ శ్రీహరి ప్రకటనలో తెలిపారు. పదోతరగతి వారు రూ.500, ఇంటర్మీడియట్ వారు రూ.వెయ్యి ఆలస్య రుసుముతో ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు. అక్టోబర్ 3 నుంచి 9వరకు వార్షిక పరీక్షలను నిర్వహించనుండగా, ఈనెల 30న హాల్‌టికెట్లు విడుదల చేస్తామని తెలిపారు.

# భూవివాదంలో రాళ్ల దాడి

- రైతులు, వెంచర్ నిర్వాహకుల మధ్య ఘర్షణ
- అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పిగ్లీపూర్‌లో ఉద్రిక్తత

గాయపడ్డ రైతు

పెద్దఅంబర్‌పేట, సెప్టెంబర్ 24: ఓ భూమి విషయమై రైతులు, వెంచర్ నిర్వాహకుల మధ్య ఏర్పడిన గొడవ.. రాళ్లు, కర్రల దాడి వరకు వెళ్లింది. ఈ ఘటన మంగళవారం రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పిగ్లీపూర్‌లో చోటుచేసుకుంది. పిగ్లీపూర్‌లోని సర్వే నంబర్ 17లో గోపాల్‌యాదవ్ వెంచర్ ఏర్పాటు చేస్తున్నారు. పలువురు రైతులు వెంచర్‌లోకి వెళ్లి.. ఇందులో సర్కారు పట్టాలు ఇచ్చిన సీలింగ్ భూమి ఉన్నదంటూ ట్రాక్టర్‌తో పనులు చేసేందుకు యత్నించారు. దీన్ని వెంచర్ నిర్వాహకులు, సిబ్బంది అడ్డుకుంటుంటే.. ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఒకరిపై ఒకరు రాళ్లతో దాడి చేసుకోగా పోలీసులు చేరుకుని ఇరువర్గాలను శాంతింపజేశారు. గాయపడ్డ రైతుల్లో పంది ముత్తయ్య, నర్సింహ, ఆకుల సత్యనారాయణ, శంకర్, మరో ఇద్దరు ఉండగా.. వెంచర్ నిర్వాహకుల్లో లోకేశ్, దర్శన్ రెడ్డి, మరొకరు ఉన్నట్టు పోలీసులు తెలిపారు. వనస్థలిపురం ఏసీపీ, అబ్దుల్లాపూర్‌మెట్ సీఐ అంజిరెడ్డి సిబ్బందితో కలిసి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. వెంచర్ నిర్వాహకులు సంప్రదింపుల కోసం పిలిచి దాడి చేశారని, కులం పేరుతో దూషించారని రైతులు ఫిర్యాదు చేశారు. వెంచర్‌లోకి చొరబడిన కొందరు స్థానికులు.. వెంచర్ నిర్వాహకులు, సిబ్బందిపై దాడికి దిగారని ఫిర్యాదు చేశారు. పరస్పరం ఫిర్యాదుల మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. కాగా.. పిగ్లీపూర్‌లో తమకు ప్రభుత్వం సీలింగ్ భూములిచ్చి పట్టాలు అందజేసిందని, ఆ భూముల్లోకి జరిగి కొందరు వెంచర్ చేస్తున్నారని, దీనిపై రెవెన్యూ, హెచ్‌ఎండీఏ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని రైతులు ఆరోపించారు. గతంలో పని చేసిన మండల రెవెన్యూ అధికారి ఇష్టానుసారంగా అనుమతులు ఇచ్చారని విమర్శించారు. వెంచర్ నిర్వాహకులు మాట్లాడుకుందామని పిలిచి, మహిళలు, పెద్ద మనుషులపై సిబ్బందితో దౌర్జన్యంగా రాళ్లు, కర్రలతో దాడిచేయించారని వాపోయారు. మరోవైపు, తమ వెంచర్‌లోని సర్వేనంబర్‌లో ఎలాంటి సీలింగ్ భూమి లేదని నిర్వాహకులు చెప్తున్నారు.

# ప్రాథమిక బడుల్లో ప్రీప్రైమరీ

- బాలవాటిక పేరుతో తరగతులు
- అధికారులను ఆదేశించిన సీఎం
- ప్రత్యేకంగా పాలసీ రూపకల్పన
- అంగన్‌వాడీల పరిస్థితి ఏంటి?

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వం సర్కారు బడుల్లో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ వంటి పూర్వ ప్రాథమిక విద్యను ప్రారంభించాలను కుంటున్నది. బాలవాటిక పేరుతో తరగతులను నిర్వహించడానికి విద్యాశాఖ అధికారులు కసరత్తు తీవ్రతరం చేశారు. రాష్ట్రంలో 18,241 ప్రాథమిక బడులున్నాయి. 3,144 ప్రాథమికోన్నత బడులను పీఎస్‌లలో విలీనం చేయనున్నారు.

**ఎన్‌రోల్‌మెంట్‌పై ప్రభావం..**

ప్రస్తుతం పూర్వప్రాథమిక విద్యాబోధన అంగన్‌వాడీ కేంద్రాల్లో కొనసాగుతున్నది. సర్కారు బడుల్లో ఒకటో తరగతి నుంచి ప్రవేశాలు కల్పిస్తున్నారు. ప్రైవేట్ బడుల్లో నర్సరీ నుంచే విద్యార్థులను చేర్చుకుంటుండంతో వారు అక్కడే కొనసాగుతున్నారు. ప్రభుత్వ బడుల్లోనూ పూర్వ ప్రాథమిక విద్య ప్రారంభించడం ద్వారా నర్సరీ దశలోనే విద్యార్థులు ప్రభుత్వ స్కూళ్ల బాట పట్టే వీలుంటుందన్న ఆలోచనలో కసరత్తు చేస్తున్నది.

**అంగన్‌వాడీలుంటాయా..?**

రాష్ట్రంలో 149 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 35,700 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిల్లో 6.67లక్షల మంది మూడేండ్ల నుంచి ఆరేండ్ల మధ్య వయస్కులు నమోదయ్యారు. కేంద్రం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యావిధానం (ఎన్‌ఈపీ) పూర్వ ప్రాథమిక విద్యను పాఠశాల విద్యలో విలీనం చేయాలని స్పష్టం చేసింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఆదిశగా ముందుకెళ్తున్నది. దీంతో అంగన్‌వాడీలు ఉంటాయా..? అన్న చర్చ నడుస్తున్నది. ప్రీ ప్రైమరీ బోధనకు కొత్త టీచర్లను నియమించాలని యోచిస్తుండటంతో అంగన్‌వాడీ టీచర్ల పరిస్థితేమిటన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

డీజీపీ ఆఫీస్ ఎదుట న్యాయం చేయాలని వేడుకుంటున్న బాధిత కుటుంబం

# న్యాయమా.. నువ్వెక్కడ!

- తమ బిడ్డ హత్యపై నిగ్గు తేల్చాలని బాధితుల డిమాండ్

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): 'అయ్యా నా బిడ్డది రోడ్డు ప్రమాదం కాదు. ముమ్మాటికీ హత్యే. సాక్ష్యాల్లేవని, రోడ్డు ప్రమాదంగా తేల్చి పోలీసులు కేసు మూసేశారు. మరోసారి విచారణ చేపట్టి న్యాయం చేయండి' అంటూ కరీంనగర్ జిల్లా చొప్పదండికి చెందిన బాధిత కుటుంబం జోరు వానలో డీజీపీ కార్యాలయం ముందు ఆర్తనాదాలు చేసింది. చొప్పదండి మున్సిపాలిటీకి చెందిన మందా విను జనవరి 22న అనుమానాస్పదంగా చనిపోయాడు. పాతకక్షల నేపథ్యంలో స్నేహితులే మేడారం జాతరకు తీసుకెళ్లి చంపేశారని తల్లి చెప్తున్నది. స్థానిక పోలీసులు డబ్బు తీసుకొని రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించి కేసు కొట్టివేశారని ఆరోపిస్తున్నారు. ఇదే విషయంపై జూలైలో డీజీపీ ఆఫీసులో మొర పెట్టుకోగా.. డబ్బు తీసుకున్న డీఎస్పీ, ఎస్సైకే మళ్లీ విచారణ బాధ్యతలు అప్పగించారని, దీంతో తమకు న్యాయం జరగలేదని ఆవేదనను వెళ్లగక్కారు. నిందితుల్లో కొందరికి కాంగ్రెస్ నాయకుల అండదండలు ఉండటం వల్లే తమకు అన్యాయం చేస్తున్నారని బోరున విలపిస్తూ చెప్పారు. ఈ కేసును రీఓపెన్ చేయించి, ఇంటెలిజెన్స్ పోలీసులతో విచారణ చేయించాలని డిమాండ్ చేస్తున్నారు. మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డిని కలిసి తమ గోడు విన్నవించుకున్నారు.

## చేపల వేటకు వెళ్లి వేర్వేరు చోట్ల ఇద్దరు మృతి

నవీపేట/బోధన్ రూరల్, సెప్టెంబర్ 24: చేపల వేటకు వెళ్లి వేర్వేరు చోట్ల ఇద్దరు మృతి చెందారు. నవీపేట మండలంలోని మహంతం గ్రామంలో మంగళవారం చేపల వేటకు వెళ్లి ఒకరు మృతి చెందాడు. ఎస్సై వినయ్ కథనం ప్రకారం.. మహంతం గ్రామానికి చెందిన పల్లికొండ భూమయ్య(61) ఈనెల 22న గ్రామ సమీపంలోని కండ సముద్రం చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. చెరువులో పడి మృతి చెందాడు. మంగళవారం చెరువులో మృతదేహం లభ్యమైంది. మృతుడి కుమారుడు పల్లికొండ సుధాకర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

**హున్సా గ్రామంలో..**

సాలూర మండలం హున్సా గ్రామంలో మల్లారం సాయిలు (43) సోమవారం ఉదయం 4 గంటలకు చేపల వేటకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. రాంసాల కుంట వద్ద కుటుంబ సభ్యులకు మృతదేహం కనిపించింది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాన్ని బయటికి తీయించారు. మృతదేహానికి పంచనామ నిర్వహించి పోస్ట్‌మార్టం నిమిత్తం బోధన్ ఏరియా దవాఖానకు తరలించినట్లు బోధన్ రూరల్ ఎస్సై మశ్చేందర్‌రెడ్డి తెలిపారు.

**చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి..**

శక్కర్‌నగర్, సెప్టెంబర్ 24: బోధన్ పట్టణం శక్కర్‌నగర్ ప్రాంతంలో అపస్మారక స్థితిలో ఉన్న గుర్తు తెలియని వ్యక్తిని చికిత్స నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందినట్లు పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. శక్కర్‌నగర్ ప్రాంతంలో ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో ఉన్నట్లు గుర్తించిన స్థానికులు 108కు సమాచారం అందించడంతో ఆయనను నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించారు. 35 ఏండ్లు ఉంటాయని చేతిపై లవ్ సింబల్ టాటూ వేసి ఉందని సీఐ తెలిపారు. ఆయన గురించి తెలిస్తే 8712659870ను సంప్రదించాలని సీఐ వెంకట నారాయణ తెలిపారు.

## దాడికి పాల్పడిన వ్యక్తి రిమాండ్

వినాయక్‌నగర్, సెప్టెంబర్ 24: ఓ యువకుడిపై దాడికి పాల్పడిన నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు త్రీ టౌన్ ఎస్సై మహేశ్ తెలిపారు. నగరంలోని త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆగస్టు 28న స్థానిక గౌతం నగర్ రోడ్డు పై పవన్ అనే యువకుడు మద్యం తాగి న్యూసెన్స్ చేస్తుండగా.. గమనించిన మాధవ్ అనే యువకుడు అతడిని వారించాడు. దీంతో పవన్ తన చేతికి ఉన్న కడియంతో మాధవ్‌పై దాడి చేయడంతో తీవ్ర గాయమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

## తిమ్మాపూర్ ఆలయంలో చోరీ

మోర్తాడ్, సెప్టెంబర్ 24: తిమ్మాపూర్ గ్రామ శివారులోని పెద్దమ్మ ఆలయంలో సోమవారం అర్ధరాత్రి దొంగతనం జరిగింది. ఆలయంలో సీసీ కెమెరాలు ఉండడంతో ఆలయ కమిటీ వారు సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించిన దొంగను గుర్తించారు. మోర్తాడ్‌లోని యానంలో ఉన్న అనుమానితుడి ఇంట్లో సోదా చేయగా గుడిగంటలు, ఆంప్లిఫ్లయర్ దొరికాయి. పెద్దమ్మ ఆలయంలో తరుచూ దొంగతనాలు జరుగుతుండడంతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు ఇటీవలే ఏర్పాటు చేయించారు. సోమవారం చోరీ జరగడంతో దొంగను గుర్తించిన ఆలయ కమిటీ సభ్యులు అతని కోసం వెతకగా పరారీలో ఉన్నట్లు సమాచారం.

**బైక్ చోరీ**

సోమవారం అర్ధరాత్రి జాతీయ రహదారి పక్కన వాటర్‌ప్లాంట్ ఎదుట నుంచి బైక్ చోరీకి గురైంది. బైక్‌ను చోరీచేసి తీసుకెళ్తున్న దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. బైక్ చోరీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు.

**ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ వైర్, ఆయిల్ చోరీ**

ఎడపల్లి, సెప్టెంబర్ 24: ఎడపల్లి మండలం ఠానాకలాన్, ఒడ్డపల్లి గ్రామాల శివారులో ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ వైర్, ఆయిల్ చోరీకి గురైన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. మంగళవారం ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఠానాకలాన్, ఒడ్డపల్లి శివారులోని రైతులు సోమవారం పొలానికి నీరు పారించడానికి వెళ్లగా ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేసి ఉన్నాయి. పోలీసులు వెళ్లి పరిశీలించారు. రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

# 'ఓటరు జాబితా సవరణ' పూర్తిచేయాలి

**రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి**

వీసీలో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్లు

కంఠేశ్వర్, సెప్టెంబర్ 24: ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పకడ్బందీగా చేపడుతూ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి సూచించారు. మంగళవారం ఆయన హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు అంశాలపై కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ ప్రక్రియ వేగవంతమైనదని, వారం రోజుల వ్యవధిలోనే 55 శాతం నుంచి 95 శాతానికి చేరుకుందని కలెక్టర్లు, ఏఆర్వోలు, బీఎల్వోలను అభినందించారు. మరో అయిదు రోజుల వ్యవధి మాత్రమే ఉన్నందున అన్ని పోలింగ్ కేంద్రాల్లో సర్వేను వందశాతం చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ ప్రక్రియను ఓటరు ముసాయిదా జాబితా వెలువరించడానికి ముందే పూర్తిచేయాలని ఆదేశించారు. ఓటరు నమోదు, మార్పులు, చేర్పులకు సంబంధించి పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించాలని సూచించారు. ఇంటింటి సర్వేలో ఆధార్ నంబర్ సేకరణ తప్పనిసరికాదని , ఓటర్లను బలవంతం చేయరాదన్నారు. కొత్త ఓటరు కార్డుల ముద్రణకు సంబంధించిన వివరాలను సకాలంలో సమర్పించాలని అన్నారు. ఉపాధ్యాయ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు ఈ నెల 30 న పబ్లిక్ నోటీస్ జారీ చేయనున్నట్లు తెలిపారు. వీసీలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్లు అంకిత్,కిరణ్‌కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో,ఆర్డీవోలు రాజేంద్రకుమార్, రాజాగౌడ్ పాల్గొన్నారు.

# కారులో మారణాయుధాలు

- మద్యం మత్తులో డ్రైవింగ్
- తనిఖీలో పట్టుబడిన వాహనం
- అందులో ఉన్న నలుగురిలో ఇద్దరు పరారీ
- పోలీసుల అదుపులో మరో ఇద్దరు

వినాయక్‌నగర్,సెప్టెంబర్ 24: జిల్లా కేంద్రంలో పోలీసు తనిఖీల్లో పట్టుబడిన కారులో మారణాయుధాలు కనిపించడం కలకలం రేపింది. సోమవారం రాత్రి పెట్రోలింగ్ విధులు నిర్వర్తిస్తున్న పోలీసులు అనుమానాస్పదంగా వచ్చిన ఓ కారును అడ్డుకోగా.. అందులో ఉన్న నలుగురిలో నుంచి ఇద్దరు పరారయ్యారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు కారులో ఉన్న మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. పారిపోయిన ఇద్దరు పాత నేరస్తులుగా అనుమానిస్తున్నారు. పోలీసులు కారును తనిఖీ చేయగా అందులో రెండు మారణాయుధా(తల్వార్)లు గుర్తించారు. ఏసీపీ రాజా వెంకటరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కంఠేశ్వర్ బైపాస్ రోడ్డు వద్ద పోలీసులు నైట్ పెట్రోలింగ్ డ్యూటీ నిర్వహిస్తున్నారు.అదే సమయంలో అటువైపుగా వేగంగా వచ్చిన ఓ కారును తనిఖీ చేసేందుకు నిలిపివేశారు.అయితే కారులో నలుగురు వ్యక్తులు ప్రయాణం చేస్తుండగా పోలీసులను చూసిన వెంటనే అందులోంచి ఇద్దరు పరారయ్యారు. మరో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకుని, కారును రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అదుపులోకి తీసుకున్న ఇద్దరు మద్యం మత్తులో ఉండగా.. నగరానికి చెందిన జస్వీర్ సింగ్, సుమేర్‌గా పోలీసులు గుర్తించారు. వారి నుంచి రెండు మారణాయుధాలు స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. పోలీసులకు చిక్కకుండా పరారైన మరో ఇద్దరు ఫయాజ్, బిలాల్‌గా నిర్ధారించారు. పట్టుబడిన ఇద్దరిపై రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి,దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ తెలిపారు.

## పౌష్టికాహారంపై అవగాహన

ఖలీల్‌వాడి(మోపాల్), సెప్టెంబర్ 24 : మండలంలోని అమ్రాబాద్ గ్రామపంచాయతీలో 7వ జాతీయ పోషణ మాసం కార్యక్రమం బోర్గాం సెక్టార్ అంగన్‌వాడీ టీచర్స్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, గ్రామస్తులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. మహిళా శిశు సంక్షేమశాఖ, ఆరోగ్యశాఖ సమన్వయంతో పని చేయాలని సూచించారు. వెయ్యి రోజుల ప్రాముఖ్యతపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో అర్బన్ సీడీపీవో నందిని, హెల్త్ ఎడ్యుకేటర్ స్వామి సులోచన, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సీతాకుమారి, సమీనాబేగం, స్వరూప, పంచయతీ కార్యదర్శి స్వరూప, పోషణ అభియాన్ జిల్లా సమన్వయకర్త రాంబాబు, ఏఎన్‌ఎంలు, ఆశలు, బోర్గాం సెక్టార్ అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు. సామూహిక సీమంతాలు, అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు.

# మహిళ హత్యకేసులో ఇద్దరికి జీవితఖైదు

వినాయక్‌నగర్, సెప్టెంబర్24: ఓ మహిళ హత్య కేసులో ఇద్దరికి జీవితఖైదు విధిస్తూ ప్రత్యేక న్యాయస్థానం స్పెషల్ జడ్జి టి.శ్రీనివాస్ మంగళవారం తీర్పు వెలువరించారు.ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు.. కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలంలోని జె.కె.తండాకు చెందిన అరుణతో ముదేలి గ్రామానికి చెందిన ఒడ్నాల అంజయ్యకు వివాహేతర సంబంధం ఉన్నదని అతడి భార్య కాశమణి.. అరుణ భర్తతోపాటు ఆమె బంధువులతోపాటు తన బంధువులకు కూడా తెలిపింది. తీరు మార్చుకోవాలని సూచించినా వారు వినకపోవడంతో కాశమణి గ్రామానికి చెందిన సుతారి చిన్న బాలయ్య సాయంతో 2019 ఆగస్టు 29న అరుణను బాన్సువాడ మండలం గాలిపూర్‌లోని నిజాం సాగర్ కెనాల్ కట్టపై మెడకు తాడు బిగించి, తలపై బండరాళ్లతో కొట్టి చంపేశారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టి సాక్ష్యాధారాలను కోర్టుకు సమర్పించారు. నేరం రుజువుకావడంతో ప్రత్యేక న్యాయస్థానం కాశమణితోపాటు బాలయ్యకు జీవిత ఖైదు విధించింది. గిరిజన మహిళ అని తెలిసి నేరానికి పాల్పడినందుకు ఎస్సీ, ఎస్టీ తెగల అత్యాచారాల నిరోధక చట్టం ప్రకారం ఆరు నెలల కఠిన జైలుశిక్ష తో పాటు వేయి రూపాయల జరిమానా సైతం విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా నెలరోజుల జైలు శిక్ష అనుభవించాలని స్పెషల్ జడ్జి శ్రీనివాస్ తన తీర్పులో పేర్కొన్నారు.

## ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని

మాక్లూర్, సెప్టెంబర్24: ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో రాజశ్రీ సూచించారు. మండలంలోని దాస్‌నగర్ సోషల్ వేల్ఫేర్ మహిళా డిగ్రీ కళాశాలలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. డీఎంహెచ్‌వో మాట్లాడారు. అనంతరం విద్యార్థినులకు రక్త రక్తహీనత పరీక్షలు నిర్వహించారు. వివిధ వ్యాధులపై వివరించారు. గైనకాలజిస్ట్ లావణ్య గైనిక్ సమస్యలపై వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో అంజన, జిల్లా మలేరియా అధికారి తుకారాం రాథోడ్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి అశోక్, సైకాలజిస్ట్ వైద్యుడు రవితేజ, పీహెచ్‌సీ వైద్యుడు నజీమొద్దీన్, ఏఎన్‌ఎంలు, పాల్గొన్నారు.

కర్ణాటకలోని శ్రీ మంజునాథ ఆలయాన్ని నిజామాబాద్ జడ్పీ మాజీ చైర్మన్లు దాదన్నగారి విఠల్‌రావు, దఫేదార్ రాజు, నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు రాంకిషన్‌రావు తదితరులు సందర్శించారు. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుతూ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు వారు తెలిపారు.

-ఖలీల్‌వాడి, సెప్టెంబర్ 24

## సంగీత పాఠశాలను కళాశాలగా ఉన్నతీకరిస్తాం

సుభాష్‌నగర్, సెప్టెంబర్ 24: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ శ్రీజ్ఞాన సరస్వతీ సంగీత నృత్య పాఠశాలను కళాశాలగా ఉన్నతీకరించేందుకు కృషి చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ రవీందర్ రాజు తెలిపారు. మంగళవారం ఆయన కళాశాల ప్రాంగణంలో విలేకరులతో మాట్లాడారు. పాఠశాలలో సిబ్బంది కొరత ఉన్నదని తెలిపారు. పేరిణి, కూచిపూడి, తబల వంటి కోర్సుల్లో శాశ్వత శిక్షకులను నియమించడానికి నివేదికను రూపొందించనట్లు తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి తబలా, కూచిపూడితో పాటు మృందంగం, వీణ వంటి కోర్సులు పునః ప్రారంభిస్తామని చెప్పారు. ప్రస్తుతం 155 మంది అడ్మిషన్స్ పొందారని ఈ సంఖ్యను రెట్టింపు చేయడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు ఈనెల 30 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అరుదైన కథక్ నృత్యాన్ని ఈఏడాది నుంచే ప్రవేశపెట్టబోతున్నట్లు వివరించారు.

## పీడీఎస్‌యూ స్వర్ణోత్సవ సభల పోస్టర్ల ఆవిష్కరణ

డిచ్‌పల్లి, సెప్టెంబర్ 24: పీడీఎస్‌యూ 50 ఏండ్ల స్వర్ణోత్సవ సభల పోస్టర్లను తెలంగాణ యూనివర్సిటీ పరిపాలన భవనం వద్ద మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ పున్నయ్య మాట్లాడుతూ.. ఎంతో మంది ఉద్యమకారులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పీడీఎస్‌యూ నుంచి వచ్చారన్నారు.ఇందులో పని చేసే విద్యార్థులు ఉద్యమాల్లోనే కాకుండా చదువులోనూ చురుకుగా ఉంటారన్నారు. విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వాన్ని పెంచి పోషించే బలమైన పాత్రను పీడీఎస్‌యూ నిర్వహించిందని తెలిపారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్, కోశాధికారి నిఖిల్, నాయకులు మహిపాల్, శివకుమార్, రాజేశ్వర్, రాజేశ్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన ఘన్‌పూర్ ఆదివాసీలు

డిచ్‌పల్లి, సెప్టెంబర్ 24 : మండలంలోని ఆదివాసీ నాయక్‌పోడ్ ఘన్‌పూర్ గ్రామస్తులు క్యాంప్ కార్యాలయంలో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని మంగళవారం కలిశారు. ఘన్‌పూర్‌లో కుల సంఘం భవన నిర్మాణం కోసం రూ.10 లక్షలు కేటాయించాలని ఎమ్మెల్యే విన్నవించగా.. సానుకూలంగా స్పందించి సీడీపీ నిధులు రాగానే నిధులు కేటాయిస్తాన అన్నారు. డిగ్రీ కళాశాల కోసం భూమి కేటాయించాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మండల నాయకులు పోలసాని శ్రీనివాస్, షాదుల్లా, లింబాద్రి, హరీశ్ పటేల్, బాజేందర్, దేవేందర్, నాయక్‌పోడ్ మండల నాయకులు గంగాధర్, శేఖర్, మోహన్, సాయిలు, బాలయ్య, సభ్యులు ఉన్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఇందల్వాయి, సెప్టెంబర్ 24: మండలంలోని తిర్మన్‌పల్లి గ్రామంలో మంగళవారం మండల ఆరోగ్య విస్తరణ అధికారి శంకర్ సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సును నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ ఇంటి ముందు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. దగ్గు, జ్వరం, కీళ్ల నొప్పులు వంటి లక్షణాలు ఉంటే వెంటనే ప్రభుత్వ దవాఖానలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.